

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సారీ

"**ఈ వంద రూపాయల నోటు** మధ్యలో చినిగిపోయింది. వేరేది ఇస్తారా?"

బేంక్ కేషియర్ని అడుగుతున్న అమృత అప్రయత్నంగా మేనేజర్ కేబిన్ వైపు చూసింది.

మధుకర్!

ఆమెనే చూస్తున్న మధుకర్ చూపు తిప్పుకుని తన ఎదురుగా కూర్చున్న కస్టమర్‌తో మాట్లాడసాగాడు.

కేషియర్ ఇచ్చిన వందరూపాయల నోటు తీసుకుని ఆమె బయటకి వెళ్ళిపోయింది.

లంచ్ టైంలో బయటకి వచ్చిన మధుకర్‌ని చూసి, మెట్లమీద కూర్చున్న అమృత లేచి నుంచుంది.

"బావున్నావా మధూ" అడిగింది.

మధుకర్ తడబడ్డాడు.

"లంచ్ కేగా? నేనూ నీతో వస్తా" చెప్పింది.

"వద్దు. నీతో మాట్లాడాలని లేదు. నన్ను వదిలెయ్" చిరాగ్గా చెప్పాడు.

"ప్లీజ్. మనం కలిసి దాదాపు ఇరవై ఏళ్ళయింది. అప్పటి కోపం ఇంకా పల్చబడకుండా ఉంటుందా చెప్పు?" అమృత అతనితో కలిసి నడుస్తూ అడిగింది.

"నేను ఇదే బ్రాంచ్‌లో పని చేయాలి. నువ్విలా మా బేంక్ ముందు గొడవ చేయద్దు" మధుకర్ కటువుగా చెప్పాడు.

"ఆకలేస్తోంది మధూ. పొద్దుట్నించీ ఈ మెట్లమీదే ఉన్నాను. పద తింటూ మాట్లాడుకుందాం" అమృత జాలిగా అడిగింది.

మధుకర్ మౌనంగా ముందుకి నడిచాడు.

రెస్టరెంట్‌లో తన ఎదురుగా కూర్చున్న అమృతని నిశితంగా చూసాడు. పెద్దగా మార్పేం లేదు. షిఫాన్ చీర కట్టుకుంది. మెడలో సన్నటి బంగారు గొలుసు. పెళ్ళి కాలేదని తెలిసిపోతోంది.

"ఏం చేస్తున్నావు?" అడిగాడు.

"'ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా."

"ఈ అవతారం ఏమిటి? నా కంటే మంచివాడు దొరకలేదా?" బాధగా అడిగాడు.

అమృత నవ్వింది. కన్నీటిని కొనగోటితో తుడుచుకుంటూ చెప్పింది.

"మధుతో సమానమైన వాళ్ళు ఎవరూ లేరు."

"మరి వద్దనుకున్నావుగా.. కారణం చెప్పకుండా" నిష్టూరంగా అడిగాడు. అమృత మాట్లాడలేదు.

"చెప్పు ఎందుకు వద్దనుకున్నావు?" మధుకర్ రెట్టించాడు.

"ఎంతమంది పిల్లలు?"

"మాట మార్చకు. ఇద్దరు. బాబు ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్. పాప మెడిసిన్ లో చేరాలని నీట్ కి ప్రిపేర్ అవుతోంది. తను ఓ ప్రైవేట్ ఫర్మ్ లోఅకౌంట్స్ ఆఫీసర్. చాలా? ఇంకేమైనా వివరాలు కావాలా?"

"తను నిన్ను ప్రేమగా చూసుకుంటుందా మధూ" అమృత అతని రెండు అరచేతులని తన చేత్తో పట్టుకుని అడిగింది.

మధుకర్ ఓ క్షణం తటపటాయించి చెప్పాడు.

"చాలా! నువ్వు గుర్తు రానంత బాగా."

అమృత నవ్వింది. ఏడుస్తూ నవ్వింది.

"ఇప్పుడు నువ్వు చెప్పు.ఎందుకలా వెళ్ళిపోయావ్?"

అమృతకి తన స్నేహితురాలి వల్ల మధుకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ అమ్మాయి మధుకర్ దగ్గర అకౌంట్స్ ట్యూషన్‌కి వెళ్ళేది. 'మా మాస్టారు' అని అతని గురించి పదే పదే చెప్పిన ఆమె, అమృతని కూడా తనతో ట్యూషన్‌కి తీసుకెళ్ళింది.

నిరుద్యోగైన మధుకర్ బేంక్ టెస్ట్‌లకి ప్రిపేర్ అవుతూ, ఇంటర్ డిగ్రీ పిల్లలకి ట్యూషన్ చెప్పేవాడు.

అనాధ అయిన అతనికి భవిష్యత్తు గురించి చాలా కలలు ఉండేవి. తను, భార్య, ఇద్దరు పిల్లలు. ఓ చిన్న స్వంతిల్లు. ప్రశాంతమైన జీవితం గడపాలనుకునేవాడు. అమృతతో పరిచయం ప్రేమగా మారాక తన భావాలు ఆమెతో పంచుకునేవాడు.

"ప్రేమించి పెళ్ళి చేసుకోవడం ఎంత అదృష్టం అమ్ము. నువ్వు నన్ను ప్రేమగా చూసుకుంటావు. పిల్లల్ని చక్కగా పెంచుతావు. ఒకళ్ళని డాక్టర్ని ఒకర్ని ఇంజనీర్‌ని చేద్దాం. నాకు కుటుంబం లేదు. ఆ కుటుంబాన్ని నువ్వు నాకు ఇవ్వాలి. నాకు పెద్ద కలలు లేవు. మితంగా, తృప్తిగా బతికితే చాలు."

అమృత అతను చెప్పేవన్నీ నిశ్శబ్దంగా, శ్రద్ధగా వినేది. అతని చేతిని గట్టిగా పట్టుకుని అతని వంకే చూస్తూండేది.

"మీ పేరెంట్స్ అభ్యంతరం చెప్తారంటావా?" ఓ రోజు అనుమానంగాఅడిగాడు.

"చెప్పరు. ఐనా నీకు జాబ్ రాగానే నీ గురించి చెప్తాను. వాళ్ళు వద్దన్నా వినను. నేను వద్దనుకుంటే వాళ్ళకి ఇంకా పిల్లలున్నారు. నీకు ఈ ప్రపంచంలో ఉన్నది నేనొక్కదాన్నే. అది బాగా గుర్తుంచుకుంటాను" చెప్పింది.

అతనికి ఆంధ్రా బేంక్‌లో జాబ్ రాగానే ఆ రాత్రే తల్లితండ్రులకి తన ప్రేమ విషయం చెప్తానని చెప్పింది. రాత్రి తొమ్మిదికి వాళ్ళు ఒప్పుకున్నారని మెసేజ్ చేసింది. మర్నాడు అతని రూములో కలవాలని నిర్ణయించుకున్నారు.

మర్నాడు అమృత రాలేదు. ఆమెనించి మెసేజ్ వచ్చింది.

"సారీ. స్నేహితులుగా విడిపోదాం. నన్ను మర్చిపో."

మధుకర్ పిచ్చివాడయ్యాడు. అమృత ఫోన్ స్విచాఫ్ చేసింది. పెద్దవాళ్ళు ఒప్పుకున్నాక ఎందుకు 'నో' చెప్పిందో అర్ధంకాలేదు. తప్పనిసరై ట్రైనింగ్‌కి వెళ్ళిపోయాడు.

"నువ్వు మేనేజర్ అయ్యావు. వెరీ హేపీ" అమృత మెరుస్తున్న కళ్ళతో చెప్పింది.

"అది సరే మీ పేరెంట్స్ ఒప్పుకున్నారని చెప్పావు. మరి ఎందుకు నన్ను వద్దనుకున్నావు? నేను అనాధనని తెలిసాక వాళ్ళు ఒప్పుకోలేదా? ఏ విషయం క్లియర్‌గా చెప్పాలికదా? అలా మొహం చాటేస్తే నేనేమైపోతానో నీకు తెలీదా? ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదు?"

అమృత విషాదంగా నవ్వింది.

"నిన్ను ప్రేమిస్తున్నానని, నువ్వు ఆంధ్రా బేంక్‌లో క్లర్క్‌గా చేరుతున్నావని, పేరెంట్స్ లేరని చెప్పగానే మా అమ్మా నాన్న ఆనందంగా పెళ్ళికి ఒప్పుకున్నారు. అదే నీకు టెక్స్ట్ చేసాను. తర్వాత మా అన్నయ్య అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. వాడు రౌడీ, చదువు, సంస్కారం లేనివాడు. వాడికి మా నాన్న మన పెళ్ళి సంగతి చెప్పాడు. వాడు "కులం, గోత్రం లేనివాడికి ఇచ్చి చేస్తారా? నేను ఇంకా మంచి సంబంధం తెస్తానని ప్రగల్భాలు పలికాడు. దానికి మా నాన్నఏమన్నాడో తెలుసా?" అమృత కన్నీళ్ళు అడిగింది.

మధుకర్ అయోమయంగా చూసాడు.

"నోర్మూయ్యరా వెధవా. పైసా సంపాదన లేదు కాని మంచి సంబంధం తెస్తాడట. నేనా రిటైరయ్యాను. నీకు చదువు, సంపాదన లేదు. ఇంకా ఇద్దరు చిన్న పిల్లలు – స్కూల్ చదువుల్లోనే ఉన్నారు. అల్లుడికి తనవాళ్ళు అంటూ ఎవరూ లేరు. అమృత పెళ్ళవగానే మనమూ దాని ఇంటికే వెళ్ళిపోదాం. ఈ ఇంటికి అద్దెందుకు దండగ? నెమ్మదిగా అల్లుడిద్వారా బేంక్ లోన్ తీసుకుని నువ్వు బిజినెస్ మొదలు పెట్టచ్చు. చిన్న పిల్లల చదువు సంధ్యలు అమ్మాయి, అల్లుడు చూసుకుంటారు. నువ్వు సంపాదనాపరుడివై, పెళ్ళి చేసుకునేదాకా మనం అమ్మాయితో ఉండచ్చు. దాన్ని ప్రేమించాడు కాబట్టి చచ్చినట్లు ఒప్పుకుంటాడు' అని నాన్న చెప్తుంటే, మా అమ్మ ఏ బిజినెస్ స్టార్ట్ చేస్తే సుపుత్రుడు లక్షాధికారి అవుతాడో చెప్తోంది" అమృత ఆగి కళ్ళు తుడుచుకుని చెప్పింది.

"వైవాహిక జీవితం మీద నీకున్న కలలు కోరికలు నాకు తెలుసు మధూ. ఈ పెళ్ళితో సాలెగూడులాంటి మా కుటుంబంలో చిక్కుకుని నువ్వు ఉక్కిరి బిక్కిరి అవుతావని మనసు చంపుకుని నీకు 'నో' చెప్పాను. మా అమ్మా, నాన్న నన్ను చాలా వేధించారు. నిన్ను చేసుకోమని. నేను నీ పేరు తప్ప వివరాలు చెప్పకపోవడంతో వాళ్ళు నిన్ను కనుక్కోలేకపోయారు. మా అన్నయ్య సంపాదన లేకపోయినా ఎవరినో తీసుకొచ్చి 'మీ కోడలు' అన్నాడు. తప్పలేదు. ఓ ప్రైవేట్ స్కూల్లో కిండర్ గార్డెన్ పిల్లలకి పాఠాలు చెప్తూ వాళ్లని పోషిస్తున్నాను. ఇవాళ నిన్ను మేనేజర్ కేబిన్‌లో చూసి ఎంత సంతోషించానో తెలుసా? నువ్వు అనుకున్నట్లే ఇద్దరు పిల్లలు, ఇంజనీర్, డాక్టర్.." అమృత కంఠం దుఃఖంతో ఆగిపోయింది.

మధుకర్ ఆమె వంక జాలిగా చూసాడు.

"ఇంక వెళ్దామా? ఇవాళ సెలవు పెట్టినందుకు మూడొందలు కట్ చేస్తారు. మా అమ్మ లబలబలాడుతుంది. మరోమాట. ఇంకెప్పుడూ ఈ బేంక్‌కి రాను. నేను నిన్ను మోసం చేయలేదని చెప్పడానికే ఇవాళ నిన్ను కలిసాను. వస్తాను... తను చాలా అదృష్టవంతురాలు" అమృత వడివడిగా వెళ్ళిపోయింది.

**(వచ్చే సంచికలో మరో సరిగమ)**

Click here to share your comments